

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
జనగామ
బుధవారం 1 అక్టోబరు 2025



పకడ్బందీగా ఎన్నికల విధులు నిర్వర్తించాలి

కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా



సమావేశం నిర్వహిస్తున్న కలెక్టర్

జనగామ రూరల్, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎన్నికలకు పకడ్బందీగా అధికారులు విధులు నిర్వర్తించాలని కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా ఆదేశించారు. స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో మంగళవారం కలెక్టరేట్‌లో నోడల్ అధికారులు, రిటర్నింగ్ అధికారులు, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులకు ఎన్నికల విధులు, బాధ్యతలు, నియమ నిబంధనలపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల నియమాలపై అధికారులు సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలని, అధికారులకు అందించిన హ్యాండ్ బుక్‌ను క్షుణ్ణంగా చదివి ప్రతి అంశంపై అవగాహన కలిగి ఉండాలని స్పష్టం చేశారు. మాస్టర్ ట్రైనర్లు ఇచ్చే శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని, నిర్వహణ ప్రక్రియలో ఏమైనా సందేహాలు, అపోహలు ఉంటే నివృత్తి చేసుకోవాలని సూచించారు. ఎన్నికల నిర్వహణకు సంబంధించి ప్రతీ బాధ్యత నోడల్, రిటర్నింగ్ అధికారులదే అన్నారు. మోడల్ కోడ్ ప్రతులు రాజకీయ పార్టీలకు అభ్యర్థులకు అందించి వాటిని అమలు చేసేలా చూడడం, ఎన్నికల ఖర్చులకు సంబంధించిన పర్యవేక్షణ బాధ్యతలు నిర్వహించడం, నిబంధనలపై అవగాహన ఉండాలన్నారు. స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ పింకేశ్ కుమార్ మాట్లాడుతూ మ్యాన్ పవర్, బ్యాలెట్ పేపర్ ముద్రణ, ట్రాన్స్‌పోర్టు, మెనేజ్‌మెంట్, మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్, తదితర ఎన్నికల నిర్వహణ బాధ్యతలను నోడల్ అధికారులు తమ విధులను జాగ్రత్తగా నిర్వర్తించాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ కలెక్టర్ సుహాసిని, జెడ్పీ అదనపు సీఈవో సరిత పాల్గొన్నారు.



నిధుల వరద

- మునిసిపాలిటీ అభివృద్ధికి రూ.50 కోట్లు
- నిధులు మంజూరు చేసిన మునిసిపల్ అడ్మినిస్ట్రేషన్ డిపార్ట్‌మెంట్
- మారనున్న ఘన్‌పూర్ రూపురేఖలు
- 25 రకాల పనులుగా విభజిస్తూ జీవో విడుదల
- నిధుల రాకతో ప్రజల హర్షం
- ఫలించిన ఎమ్మెల్యే చొరవ

స్టేషన్‌ఘన్‌పూర్, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): స్టేషన్‌ఘన్‌పూర్ మునిసిపాలిటీకి మహర్దశ పట్టనుంది. సర్కారు భారీగా నిధులు కేటాయించడంతో ఇక అభివృద్ధి పట్టాలెక్కనుంది. స్థానిక ఎమ్మెల్యే కడియం శ్రీహరి చొరవతో మునిసిపాలిటీకి ఏకంగా రూ.50కోట్ల నిధులు మంజూరుకావడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. సెప్టెంబరు 29న రూ.50 కోట్ల నిధులు మంజూరి చేస్తూ జీవోను సైతం విడుదల చేసింది. దీంతో మునిసిపాలిటీ ప్రగతిపై కొత్త ఆశలు రేకెత్తుతున్నాయి. పనులను 25 విభాగాలు విభజించి నిధులు మంజూరు చేసింది.

అనేక ఏళ్ల నుంచి ఎదురుచూసిన తర్వాత స్టేషన్‌ఘన్‌పూర్‌ను మునిసిపాలిటీగా గత జనవరి 18న రాష్ట్ర ప్రభుత్వం గెజిట్ విడుదల చేసింది. తర్వాత జనవరి 27న స్టేషన్‌ఘన్‌పూర్, ఛాగల్, శివునిపల్లి గ్రామాలను విలీనం చేస్తూ స్టేషన్‌ఘన్‌పూర్ మునిసిపాలిటీగా మార్చుతూ కమిషనర్ అండ్ డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్



డాక్టర్ టీ.కే శ్రీదేవి ఉత్తర్వులు జారీచేశారు. అప్పటి నుంచి స్టేషన్‌ఘన్‌పూర్, ఛాగల్, శివునిపల్లి గ్రామాల పరిధిలో గ్రామ పంచాయతీ సేవలు రద్దయి మునిసిపల్ సేవలు ప్రారంభమయ్యాయి. జూన్ 4న స్టేషన్‌ఘన్‌పూర్ మునిసిపాలిటీని 18 వార్డులుగా విభజిస్తూ నోటిఫికేషన్ జారీ చేశారు. ఛాగల్ గ్రామ పరిధిని 4 వార్డులుగా, శివునిపల్లి పరిధిని 4వార్డులుగా, ఘన్‌పూర్ పరిధిని 10 వార్డులుగా విభజంచారు. 1, 10, 11, 12, 13, 14, 15, 16, 17, 18వ వార్డులు ఘన్‌పూర్ పరిధిలో, 2, 3, 4, 5వ వార్డులు శివునిపల్లి గ్రామ పరిధిలో, 6, 7, 8, 9వ వార్డులు ఛాగల్ పరిధిలోకి వచ్చాయి.

ఎమ్మెల్యే ప్రత్యేక చొరవ

ఎన్నికల సమయంలో స్టేషన్‌ఘన్‌పూర్‌ను మునిసిపాలిటీగా మార్చి, అన్నివిధాలా అభివృద్ధి చేస్తానని ఎమ్మెల్యే కడియం శ్రీహరి హామీ ఇచ్చారు. ఇందులో భాగంగా ప్రత్యేక చొరవ తీసుకుని మునిసిపాలిటీగా రూపొందించడంతో సక్సెస్ అయ్యారు. తర్వాత మునిసిపాలిటీ అభివృద్ధి కోసం ఎస్టిమేషన్స్ (మిగతా 8వ పేజీలో..)

వివాహిత ఆత్మహత్య

కుటుంబ కలహాలే కారణమా?

శివునిపల్లిలో విషాదం - 6లో











సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రీహరి

బీసీల రిజర్వేషన్లకు మద్దతివ్వాలి

- మునిసిపాలిటీ అభివృద్ధికి రూ.50కోట్లు మంజూరు
- 'దేవాదుల'కు రూ.1,001కోట్లు విడుదల
- స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి

వివరాలు: 7వ పేజీలో



ఆంధ్రజ్యోతికి 23 వ వార్షికోత్సవ శుభాకాంక్షలు

మిత్రులకు, శ్రేయోభిలాషులకు, రైతులకు, అధికారులకు, దసరా మరియు దీపావళి శుభాకాంక్షలు

బెలిదె వెంకన్న రైస్ మిల్లర్ల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు అన్నపూర్ణ ఆగ్రో ఇండస్ట్రీస్ GNP STN	జొన్నల సోమేశ్వర్ రోహిణి అగ్రోటెక్ రాఘవాపూర్ GNP STN	పాలకుర్తి సోమశేఖర్ ఉమామహేశ్వర ట్రేడర్స్ GNP STN 984973669
యాద శ్రీనివాస్ ఆర్య వైశ్య జాతీయ సమాఖ్య మండల అధ్యక్షుడు GNP STN 986611638	కలకోట రంగాచారి RTD MRO తిరుమల నాథ స్వామి దేవాలయ అభివృద్ధి కమిటి GNP STN	కూరెల్లి కృష్ణ మూర్తి కూరెల్లి భాను ప్రకాష్ డాక్యుమెంట్ రైటర్స్ GNP STN
గన్ను శ్రీనివాస్-సునిత ప్రముఖ వ్యాపారి, గుడులు, బడులకు విరాళ దాత GNP STN	మహంకాళి విజయ్ కుమార్ ఐశ్వర్య ట్రేడర్స్ GNP STN 9849570588	చిలువేరు వెంకటేశ్వర్లు రాధాకృష్ణ ఆయిల్స్ & జనరల్ స్టోర్ శివునిపల్లి 9849841415
చిలువేరు నాగేశ్వర రావు చిలువేరు లక్ష్మీ నారాయణ కిరాణం సంతోష్ ఆయిల్ మిల్లు- శివునిపల్లి	బెలిదె వీర నర్సయ్య రైస్ మిల్లర్స్, శ్రీ లక్ష్మీ ఆగ్రో ఇండస్ట్రీస్ శివునిపల్లి	కిరణ్ బుక్ స్టాల్ తుమ్మనపల్లి రవికిరణ్, ఘన్‌పూర్ (స్టే) 9948451205
జొన్నల రాజేశ్వర్ రావు రైస్ మిల్లర్ పూర్వవిద్యార్థుల కమిటి అధ్యక్షులు-శివునిపల్లి	అనిల్ బుక్ స్టాల్ జనరల్ స్టోర్స్, గౌరిశెట్టి అనిల్ లయన్స్ క్లబ్ అధ్యక్షుడు - శివునిపల్లి	తెల్లాకుల రామకృష్ణ రామకృష్ణ జిరాక్స్ ఘన్‌పూర్ (స్టే) 9666178899





డిగ్రీ కళాశాలలోని తరగతిగదిని పరిశీలిస్తున్న కలెక్టర్ దివాకర

డిగ్రీ కళాశాల భవనాన్ని పరిశీలించిన కలెక్టర్

ములుగు కలెక్టరేట్, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణ నేపథ్యంలో స్ట్రాంగ్‌రూం ఏర్పాటు కోసం ములుగు కలెక్టర్ టీఎస్. దివాకర అధికారులతో కలిసి జిల్లాకేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల భవనాన్ని మంగళవారం పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ స్ట్రాంగ్‌రూం ఏర్పాటుకు కిటికీలు, వెంటిలేటర్లను పూర్తిగా మూసివేయాలన్నారు.

స్ట్రాంగ్‌రూంకు రంగులు వేయాలని, విద్యుత్ సౌకర్యం ఉండేలా చర్యలు తీసుకోవాలని, సీసీ కెమెరాలు అమర్చాలని, నిరంతరం పటిష్ట పోలీస్ బందోబస్తు నిర్వహించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కలెక్టర్ వెంట డీపీవో దేవరాజ్ తదితరులు ఉన్నారు.

బాల్ బ్యాడ్మింటన్‌లో తృతీయ బహుమతి



అశ్వతేజ్‌రెడ్డి

చిలుపూర్, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిన్నపెండ్యాలకు చెందిన తొమ్మిదో తరగతి విద్యార్థి గుంపుల అశ్వతేజ్‌రెడ్డి జాతీయ స్థాయి సబ్ జూనియర్స్ బాలుర విభాగం బాల్ బ్యాడ్మింటన్‌లో తృతీయ బహుమతి సాధించారు. ఈనెల 25 నుంచి తమిళనాడు రాష్ట్రంలోని దిండిగల్‌లో 44వ జాతీయస్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహించారు. తెలంగాణ జట్టు నుంచి పాల్గొని అత్యుత్తమ ప్రతిభ కనబరిచి తృతీయ స్థానం సంపాదించాడు. జఫర్‌ఘఢ్ మండలంలోని కూనూరులో నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొని జాతీయ స్థాయికి ఎంపికయ్యాడు. దీంతో పాఠశాల ఉపాధ్యాయ బృందంతోపాటు, గ్రామస్థులు అశ్వతేజ్‌రెడ్డి అభినందించారు.

జాతీయ ఫుట్‌బాల్ టోర్నీకి గురుకుల విద్యార్థి



గిరీష్ వర్ధన్

స్టేషన్‌ఘన్‌పూర్ టౌన్, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): స్టేషన్ ఘన్‌పూర్ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, కళాశాల ఇంటర్ ఫస్టియర్ విద్యార్థి ఎం.గిరీష్ వర్ధన్ రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీల్లో ప్రతిభ చూపి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. అక్టోబరు 5 నుంచి 8 వరకు జమ్మూ కాశ్మీర్‌లో నిర్వహించే జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటాడని ప్రిన్సిపాల్ రఘుపతి, పీడీ గుంటి శ్రీనివాస్ తెలిపారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ రవీందర్, జయధర్ పాల్గొన్నారు.

12యూనిట్ల రక్తం సేకరణ



ప్రశంసాపత్రాలతో రక్త దాతలు

జనగామ కల్చరల్, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): జాతీయ రక్తదాన వారోత్సవాలను పురస్కరించుకొని రక్తదాన శిబిరంలో 12యూనిట్ల రక్తాన్ని సేకరించారు. లయన్స్ క్లబ్ ఆఫ్ జనగామ మిలీనియం పూర్వ రీజియన్ చైర్మన్ శ్రీరాం శ్రీనివాస్ ఆధ్వర్యంలో మంగళవారం జనగామ వీవర్స్ కాలనీలో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రక్తదాతలకు ప్రశంసాపత్రాలు అందించారు. కార్యక్రమంలో బ్లడ్‌బ్యాంక్ వైద్యులు పగిడిపాటి కరుణాకర్‌రాజు, మోర్తాల దివ్య, క్లబ్ ప్రతినిధులు పిల్లలమర్రి ఉదయ్, గుర్రం అనిల్‌గౌడ్, హరిగౌడ్, ఎనగందుల కృష్ణ, బిట్ల అనిల్, చిదురాల కృష్ణ, బొంతపల్లి నాగరాజు, భీమనాదం హరీష్, తౌటం సురేష్, బొంతపల్లి చిన్న, బుదారపు రమేష్, గర్దాసు గణేష్, ఏనుగు నర్సిరెడ్డి, బిట్ల నాగేంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.



WANTED
★ Wanted English (Primary) Social-Studies(H.S) Teachers for Chaitanya Model High School Parkal. Part Time/Full Time.Cell.No: 7337069698
AJW-243191

HOUSE FOR SALE
★ HNK Opp : KUC Police Station, రుద్రమదేవి కాలని, రోడ్ నెం.8, భీమారం 3/2 BHK Ready to Move, మూడు ఇండిపెండెంట్ ఇండ్లు, 160 Sqy, Rs.68 Lakhs కి అమ్మకానికి కలవు. సంప్రదించండి 9118706786, 8074260608.
AJW-243072

WANTED
★ Medical Shop Boys(Exp), Lab-Techinicians (Exp) Dialasis Technicians(Exp) System Operators (Ex) in Hospital/Insurances Cont: Guardian Hospital Wgl. 2 to 3pm
AJW-574

HOUSES FOR SALE
★ Duplex House for Sale 140 Sq.Yards, Opp : Shyamala Gardens, TNGO's Colony, Road No: 6C & 6E. Cell.No 9949103115
AJW-243515

WANTED
★ హెల్త్ ఇన్సూరెన్స్ పనిచేయుటకు మార్కెటింగ్ ఏజెంట్స్ కావలెను. Part Time/full Time, No age Limit. Cont: 7382323014
AJW-243434

LAND REQUIRED
★ భూమి కావలెను 10 నుండి 50 ఎకరాల వరకు నీటి సౌకర్యం కలిగిన వ్యవసాయ భూమి లీజుకు కావలెను. సంప్రదించండి 9440522536, 7013226716
AJW-243433

పాఠకులకు ముఖ్య గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన/క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.
మేనేజర్ - ఏడివిటి

ప్రకటనల కొరకు సంప్రదించండి
హన్మకొండ
9985400013
8978510273
9985411677
వరంగల్
9949638376
9985408173
జనగామ
9866431354
మహబూబాబాద్
9985418040
తొర్రూర్
9985418040
నర్సంపేట
9949638376
భూపాలపల్లి
9985401232
పరకాల
9985401232

ప్రతి నాలుగు లైన్ల క్లాసిఫైడ్ ప్రకటనకు రూ. 250/- మాత్రమే. అదనపు లైనుకు రూ. 45/-
గమనిక : మీరు ఇచ్చే ప్రతీ ప్రకటనలకు 5% GST అదనంగా చెల్లించవలెను.

ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి

కృష్ణకాలనీ, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని బీఆర్‌ఎస్ కార్యాలయంలో మంగళవారం జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి 22 నెలలు కావస్తున్నా ఎన్నికల హామీలు నెరవేర్చడంలో విఫలం చెందిందన్నారు. 22 నెలల్లో అన్ని వర్గాల ప్రజలకు ప్రభుత్వం ఎంత బాకీ పడిందో ఓ కార్డును రూపొందించామన్నారు. ఈ కార్డు ద్వారా ప్రజలకు తెలియజేయాలన్నారు. స్థానిక ఎన్నికలకు ఓటు కోసం ఇంటికి వచ్చే కాంగ్రెస్ నాయకులను నిలదీసేలా చైతన్యం తీసుకరావాలన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్‌ఎస్ మద్దతుతో పోటీ చేసే అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా పని చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ రూరల్ అధ్యక్షుడు పిన్‌రెడ్డి రాజిరెడ్డి, నాయకులు మందల విద్యాసాగర్‌రెడ్డి, పొల్సాని లక్ష్మీనరసింహారావు, పోరెడ్డి పూర్ణచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలపై రూపొందించిన కార్డును చూపిస్తున్న మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి

ఆర్టీసీ బస్సును ఢీకొన్న కారు

● ఇద్దరికి తీవ్రగాయాలు
● స్వల్పంగా గాయపడిన 11 మంది





ప్రమాదానికి గురైన ఆర్టీసీ బస్సు, కారు

కృష్ణకాలనీ, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ బస్సును కారు ఢీకొన్న సంఘటన భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని జాతీయ రహదారి బాంబులగడ్డ సమీపంలో మంగళారం జరిగింది. ఈ ప్రమాదంలో కారులో ఉన్న ఒకరు, బస్సులో ఉన్న మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. అదే కారులో ఉన్న మరో ఇద్దరితోపాటు బస్సులో ఉన్న 9 మందికి స్వల్ప గాయాలయ్యాయి.

స్థానికులు, పోలీసులు, ఆర్టీసీ డిపో అధికారులు తెలిపిన వివరాల ప్రకా రం.. భూపాలపల్లి ఆర్టీసీ డిపోకు చెందిన పల్లె వెలుగు బస్సు రోజువారీ ట్రిప్పుల్లో భాగంగా మంచిర్యాలకు బయల్దేరింది. ఈ క్రమంలో భూపాలపల్లి మండలంలోని పంబాపూర్ గ్రామానికి చెందిన దండిగ సాయికృష్ణ, తన బంధువు గజ్జి అఖిల్‌తోపాటు మరో వ్యక్తి కారులో భూపాలపల్లికి వస్తున్నాడు. మార్గమధ్యలో బాంబులగడ్డ సమీపంలో కోతులు ఎదురుగా రావడంతో తప్పించబోయి ఎదురుగా వస్తున్న ఆర్టీసీ బస్సును ఢీకొన్నారు. దీంతో కారు నడుపుతున్న సాయికృష్ణకు తీవ్ర గాయాలయ్యాయి. అదే కారులో ఉన్న గజ్జి అఖిల్‌తోపాటు మరో వ్యక్తి స్వల్పంగా గాయపడ్డారు. అలాగే బస్సులో ముందు సీటులో కూర్చున్న మహిళ తలకు తీవ్రం గాయమైంది. బస్సులో ఉన్న మరో తొమ్మిది మంది స్వల్పంగా గాయపడ్డారు. క్షతగ్రాతులను భూపాలపల్లిలోని వంద పడకల ఆస్పత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న భూపాలపల్లి పోలీసులు, ఆర్టీసీ డిపో మేనేజర్ ఇందు ఘటన స్థలానికి చేరుకొని ప్రమాద పరిస్థితిని ఆరా తీశారు. ఆర్టీసీ డ్రైవర్ అప్రమత్తతో వ్యవహరించడంతోనే పెను ప్రమాదం తప్పిందని తెలుస్తోంది. ఈ జరిగిన సమయంలో బస్సులో మొత్తం 57 మంది ప్రయాణికులు ఉన్నారు.

వివాహిత ఆత్మహత్య

● కుటుంబ కలహాలే కారణమా? ● శివునిపల్లిలో విషాదం

స్టేషన్‌ఘన్‌పూర్, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): కుటుంబ కలహాలతో వివాహిత ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మంగళవారం జనగామ జిల్లా శివునిపల్లి పట్టణంలో చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం.

శివునిపల్లికి తొరివి అశ్వని(41) మోహన్‌శర్మ దంపతులు. వీరికి కుమారుడు ఉన్నాడు. మోహన్‌శర్మ పౌరోహిత్యం చేస్తుండగా, అశ్విని గృహిణి. రోజు మాదిరిగానే పూజా కార్యక్రమాల్లో భాగంగా ఆలయానికి మోహన్‌శర్మ వెళ్లి పూజ కార్యక్రమాలు ముగించుకొని మధ్యాహ్నం ఇంటికి వచ్చాడు. మొదట అశ్వని బెడ్‌రూంలో నిద్రిస్తోందని భావించాడు. కాసేపటికి బెడ్‌రూం తలుపు తెరిచి చూడగా సీలింగ్ ఫ్యాన్‌కు ఉరివేసుకొని కనిపించింది. లబోదిబోమంటూ స్థానికుల సాయంతో కిందకు దించాడు. అప్పటికే అశ్విని మృతి చెందింది.



తొరివి అశ్విని (ఫైల్), అశ్విని మృతదేహం

విషయం తెలుసుకున్న ఎస్సైలు వినయ్‌కుమార్, మనీషాలు అక్కడికి చేరుకొని విచారణ చేపట్టి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జనగామ ఏరియా ఆస్పత్రికి తరలించారు. కాగా, వివాహిత మృతికి గల కారణాలు తెలియరాలేదు. కుటుంబ కలహాలే కారణమై ఉండొచ్చని పోలీసులు భావిస్తున్నారు.

జిల్లాలో 496 లూజ్‌లైన్లు

● 227 వంగిన విద్యుత్ స్థంబాల మరమ్మతులు
● జిల్లా విద్యుత్‌శాఖ అధికారి విజేందర్‌రెడ్డి

మహబూబాబాద్ రూరల్, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : మహబూబాబాద్ జిల్లాలో విద్యుత్ అధికారుల పొలంబాట కార్యక్రమం ద్వారా ప్రమాద భరితంగా ఉన్న లూజు లైన్లు, వంగిన విద్యుత్ స్థంబాలను, మధ్య స్తంభాలను పునరుద్ధరిం చినట్లు జిల్లా విద్యుత్‌శాఖ అధికారి విజేందర్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని 492 లూజులైన్లు, 227 వంగిన స్థంబాలు, 479 మధ్య స్తంభాలను సరిచేయడం జరిగిందన్నారు. రైతులకు ట్రాన్స్‌ఫారాలు, ఓవర్‌లోడ్ సమస్యలను తీర్చడానికి ఎక్కడైతే ఓవర్‌లోడ్ అవుతున్న ట్రాన్స్‌ఫారాలను ముందే గుర్తించి వాటి సామర్థ్యాన్ని పెంచి ఓవర్‌లోడ్ సమస్యను తీర్చనున్నట్లు పేర్కొన్నారు. విద్యుత్ సమస్యల పరిష్కారానికి టోల్ ఫ్రీ నెంబర్ :1912కు సమాచారం అందించాలని పేర్కొన్నారు.

పండగ వేళ గొడవలు సృష్టిస్తే ఊపేక్షించం

● భూపాలపల్లి డీఎస్పీ సంపత్‌రావు



మాట్లాడుతున్న డీఎస్పీ సంపత్‌రావు

కృష్ణకాలనీ, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): దసరా పండగ వేళ ఎవరైనా గొడవలు సృష్టిస్తే ఊపేక్షించబోమని, కేసులు నమోదు చేస్తామని భూపాలపల్లి డీఎస్పీ అవిర్నేని సంపత్‌రావు హెచ్చరించారు. భూపాలపల్లి మునిసిపాలిటీ పరిధిలోని ఖాసీంపల్లిలో మంగళవారం కార్డెన్ సెర్చ్ నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దసరా ఆరు మండలాల్లో ప్రశాంతంగా జరిగిం దన్నారు. ఖాసీంపల్లిలో చిన్న గలాటా జరిగిందన్నారు. అలాంటివి మళ్లీ ఏమైనా గొడవలు సృష్టిస్తే చర్యలు తప్పవని అన్నారు. ప్రశాంత వాతావరణంలో వేడుకలు జరుపుకోవాలన్నారు. అనవసర పంతాలకు పోయి ఎవరూ కేసుల పాలు కావద్దన్నారు. అంతకు ముందు గ్రామంలో సోదాలు చేశారు. వాహనాల తనిఖీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీఐ నరేష్‌కుమార్, ఎస్సైలు సాంబమూర్తి, సతీష్, ఉమెన్ ఎస్సై రవళి, సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి



వెంకన్న (ఫైల్)

పాలకుర్తి, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : పాలకుర్తి, నాంచారిమడూరు ప్రధాన రహదారిపై సిరిపన్నగూడెం శివారులోని కంబాలకుంట బస్‌స్టేజీ వద్ద మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం.. జనగామ జిల్లా పాలకుర్తి మండలం దర్దెపల్లికి చెందిన తాళ్లపల్లి వెంకన్న గౌడ్ (37) కులవృత్తి చేసుకుని జీవిస్తున్నాడు. మోటార్ సైకిల్‌లో పెట్రోల్ పోయించుకునేందుకు మల్లంపల్లి శివారులోని పెట్రోల్ బంకు వద్దకు వెళ్లి, తిరుగు తిరుగుముఖం పట్టాడు. ఈ క్రమంలో వెనుక నుంచి వచ్చిన డీసీఎం వ్యాన్ ఢీకొట్టడంతో కిందపడ్డ వెంకన్న తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. వెంకన్న భార్య పది రోజుల క్రితం కుమారుడికి జన్మనిచ్చింది. కుమారుడి ఆలనా పాలనా చూడకుండానే వెంకన్న మృతి చెందడంతో గ్రామంలో విషాదచాయలు అలుముకున్నాయి. మృతుడు తండ్రి కుమారస్వామి ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్టు ఎస్సై పవన్ కుమార్ తెలిపారు.

లారీ ఢీకొని హెడ్ కానిస్టేబుల్ మృతి

పరకాల, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): హెడ్ కానిస్టేబుల్‌ను కంకర లారీ బలిగొన్న ఘటన పరకాల మండలం కామారెడ్డిపల్లి వద్ద మంగళవారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. శాయంపేట మండలం పత్తిపాక గ్రామానికి చెందిన ఆకుల రవీందర్ (58) పరకాల పోలీసు స్టేషన్‌లో హెడ్‌కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. మంగళవారం డ్యూటీ ముగించుకొని ద్విచక్రవాహనంపై ఇంటికి తిరిగి వెళుతున్న క్రమంలో కామారెడ్డిపల్లి వద్ద మాందారిపేట నుంచి పరకాల వైపు వెళుతున్న కంకర లారీ గొర్రెల మందను తప్పించబోయి కొర్లకాపరి పాలకుర్తి సాంబయ్యను ఢీకొట్టి హెడ్ కానిస్టేబుల్ ద్విచక్రవాహనాన్ని సైతం ఢీకొట్టి పల్టీకొట్టింది. ఈ ఘటనలో సాంబయ్య స్వల్పంగా గాయపడగా, హెడ్ కానిస్టేబుల్ రవీందర్ తీవ్రంగా గాయపడ్డారు. వెంటనే పరకాల ఎస్ఐ విఠల్, 108 సిబ్బంది ఘటనాస్థలానికి చేరుకొని చికిత్స నిమిత్తం వరంగల్‌లోని ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ హెడ్ కానిస్టేబుల్ రవీందర్ మృతి చెందాడు. దీంతో పరకాల పోలీసు స్టేషన్‌లో విషాదఛాయలు అలుముకున్నాయి. మృతుడికి భార్యతోపాటు ఇద్దరు కుమారులు, ఒక కూతురు ఉన్నారు.

శ్రామిక రాష్ట్ర మహిళ సదస్సును విజయవంతం చేయాలి

సీఐటీయూ శ్రామిక మహిళ రాష్ట్ర కార్యదర్శి మాధవి



సదస్సు వాల్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సీఐటీయూ రాష్ట్ర మహిళ కార్యదర్శి మాధవి

హనుమకొండ చౌరస్తా, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా శ్రామిక మహిళలు ఎదుర్కొంటు న్న సమస్యలపై అక్టోబరు 5, 6వ తేదీల్లో కాగజ్‌నగర్‌లో నిర్వహించతలపెట్టిన శ్రామిక మహిళా రాష్ట్ర సదస్సును విజయవంతం చేయాలని సీఐటీయూ శ్రామిక మహిళ రాష్ట్ర కార్యదర్శి కాసు మాధవి పిలుపునిచ్చారు. మంగళవారం హనుమకొండ రాంనగర్‌లోని సుందరయ్య భవన్‌లో సీఐటీయూ శ్రామిక మహిళా జిల్లా కార్యదర్శి ఎస్.రజిత అధ్యక్షతన ఏర్పాటు చేసిన సదస్సుకు మాధవి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా శ్రామిక మహిళా రాష్ట్ర సదస్సు వాల్ పోస్టర్‌ను మాధవి ఆవిష్కరించి అనంతరం మాట్లాడారు.

శ్రామిక మహిళలపై పనిచేసే ప్రదేశాల్లో హింస, అత్యాచారాలు, యాసిడ్ దాడులు, లైంగిక వేధింపులను అరికట్టాలన్నారు. సమాన పనికి సమాన వేతనం తో పాటు కార్మిక చట్టాలను పకడ్బందీగా అమలు చేయాలని ఆమె డిమాండ్ చేశారు. శ్రామిక మహిళ లు గౌరవ ప్రదమైన జీవనం కొనసాగించడానికి అన్ని రకాల రక్షణ చర్యలు ప్రభుత్వం తీసుకోవాలన్నారు. చట్టసభల్లో 33శాతం రిజర్వేషన్ల కోసం దేశ వ్యా ప్తంగా సీఐటీయూ నిరంతర ఉద్యమాన్ని చేపట్టనున్నామని మాధవి హెచ్చరించారు. దేశంలో ప్రధాన రాజకీయ పార్టీలు ఎన్నికల ఎజెండాలో పైఅంశాలను చేర్చకపోవడం శోచనీయంగా ఉందన్నారు. శ్రామిక మహిళల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వము తక్షణమే పరిష్కరించాలని మాధవి కోరారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి రమేష్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో పనిచేస్తున్న స్కీం వర్కర్లకు కనీస వేతనాలు అమలు చే యడంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. మహిళా సాధికారత ప్రధాన లక్ష్యం అని పదే పదే చెబుతున్న సీఎం రేవంత్‌రెడ్డి.. మహి ళా వర్కర్ల చేత వెట్టిచాకిరీ ఎందుకు చేపిస్తున్నారో చెప్పాల్సిన అవసరం ఉందని రమేష్ అన్నారు. సదస్సులో హైమావతి, కె.జమున, శోభారాణి, కె.రమాదేవి, యాకూబీ, లీల పాల్గొన్నారు.

అక్షర చిట్‌ఫండ్ వద్ద బాధితుల ఆందోళన

హనుమకొండ టౌన్, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ బాలసముద్రంలోని అక్షర చిట్‌ఫండ్ కార్యాలయం వద్ద చిట్టీదారులు మంగళవారం ఆందోళనకు దిగారు. డిపాజిట్లు పెట్టినా డబ్బులు తిరిగి ఇవ్వకపోవడంతో బాధితులు పెద్ద సంఖ్యలో కార్యాలయం వద్దకు చేరుకుని నిరసన వ్యక్తం చేశారు. మహిళలు, వృద్ధులు సహా వందలాది మంది ఉదయం నుంచి సాయంత్రం వరకు వేచి ఉన్నారు. చిట్‌ఫండ్ బాధ్యులతో బాధితులకు వాగ్వాదం జరిగింది. సుబేదారీ సీఐ ఎం.రంజిత్‌కుమార్ ఆధ్వర్యంలో అక్షర చిట్‌ఫండ్ వద్ద పోలీసులు ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేశారు. చిట్‌ఫండ్ నుంచి డబ్బులు ఇప్పించాలని డిమాండ్ చేస్తూ రాత్రి వరకు అందోళన చేశారు.

కన్స్యూమర్ రైట్స్ సౌత్ ఇండియా అధ్యక్షుడిగా నరేశ్

వరంగల్ మెడికల్, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): నేషనల్ కన్స్యూమర్ రైట్స్ కమిషన్ సౌత్ ఇండియా అధ్యక్షుడిగా ప్రముఖ వైద్యుడు, సామాజిక కార్యకర్త డాక్టర్ బారి నరేశ్ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు కమిషన్ జాతీయ అధ్యక్షుడు సాయి రమేశ్‌గౌడ్, జాతీయ అబ్జర్వర్ రాధాకృష్ణ సంయుక్త తెలిపారు.

యోగా సర్టిఫికెట్ కోర్సుకు దరఖాస్తులు

వడ్డెపల్లి, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): యోగా డిప్లొమా సర్టిఫికెట్ కోర్సులో చేరేందుకు అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని హపీ లివింగ్ అకాడమీ ఫౌండర్, యోగాచార్యులు ఆంజనేయులు, డైరెక్టర్ మహేశ్ తెలిపారు. ఎస్సెస్సీ, ఇంటర్, డిగ్రీ పూర్తి చేసిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. ఎంపికైన అభ్యర్థులకు హనుమకొండ 56వ డివిజన్‌లోని పోలీసు కాలనీ వద్ద గల సాయి సేవా ట్రస్ట్‌లో శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. శిక్షణ పూర్తి చేసుకున్న వారికి కాకతీయ యూనివర్సిటీ సీడీవోఈ ద్వారా ప్రామాణిక సర్టిఫికెట్లు ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. వివరాలకు సెల్ నెంబర్ 95534 89862, 99126 40919లలో సంప్రదించాలన్నారు.

తగ్గుముఖం పట్టిన గోదావరి

మహదేవపూర్, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలం త్రివేణి సంగమ కాళేశ్వరం వద్ద మంగళవారం గోదావరి వరద తగ్గుముఖం పట్టింది. ఎగువ నుంచి వరద తక్కువ కావడంతో కాళేశ్వరం వద్ద 10.04 మీటర్ల ఎత్తుతో గోదావరి ప్రవహిస్తోంది.

● వాజేడు (ఆంధ్రజ్యోతి): మండలంలో గోదావరి తగ్గుముఖం పడుతోంది. మంగళవారం ఉదయం నుంచి గోదావరి వరద ప్రవాహం నెమ్మదిగా తగ్గుతుంది. పేరూరు వద్ద ఉదయం 6గంటలకు 17.370 మీటర్ల నీటమట్టం ఉండగా 9గంటలకు 17.340 మీటర్లు, మధ్యాహ్నం 12 గంటలకు 17.170 మీటర్లు, 3 గంటలకు 16.990 మీటర్ల నీటిమట్టంకు చేరుకొని తగ్గుముఖం పడుతోందని సీడబ్ల్యూసీ అధికారులు తెలిపారు. అయితే.. గోదావరి తగ్గుముఖం పట్టినప్పటికీ టేకులగూడెం వద్ద జాతీయ రహదారి నీట మునిగే ఉంది. ప్రస్తుతం 16.990 మీటర్లు ఉన్న గోదావరి నీటిమట్టం 14మీటర్లకు చేరుకుంటే జాతీయ రహదారిపై వరద నీటి ప్రవాహం తగ్గి రాకపోకలకు అంతరాయం లేకుండా ఉంటుంది. ఇదిలా ఉండగా

గోదావరి వరదలతో మిర్చి రైతులకు భారీ నష్టం వాటిల్లింది. అకస్మాత్తుగా గోదావరికి వరద ప్రవాహం పెరగటంతో ముందే వేసిన మిర్చి నార్లు మునిగిపోయి రైతులకు నష్టం చేకూరింది. మండలంలో సుమారు 400 ఎకరాల్లో మిర్చి పంట వరదలో మునిగిపోవడంతో రైతులు దిగాలు చెందుతున్నారు. ప్రభుత్వం తమను ఆదుకోవాలని కోరుతున్నారు.



కాళేశ్వరం త్రివేణి సంగమం వద్ద గోదావరి ప్రవాహం

● ఏటూరునాగారం రూరల్ (ఆంధ్రజ్యోతి) : మండలంలో రెండు రోజులుగా ఉధృతంగా ప్రవహించిన గోదావరి మంగళవారం క్రమంగా తగ్గుముఖం పట్టింది. రామన్నగూడెం పుష్కరఘాట్ వద్ద గోదావరి క్రమంగా తగ్గుతోంది. సోమవారం రెండో ప్రమాద హెచ్చరిక దాటి పుష్కరఘాట్ వద్ద ప్రవాహం కొనసాగింది. పుష్కరఘాట్ వద్ద ఉదయం 6 గంటలకు 16.110 మీటర్లకు చేరిన నీటిమట్టం ఆ తర్వాత మూడు గంటల పాటు నిలకడగా ఉంది. అనతరం క్రమంగా తగ్గింది. నీటి ప్రవాహం సాయంత్రం 5 గంటలకు 15.860 మీటర్లకు తగ్గడంతో అధికారులు రెండో ప్రమాద హెచ్చరికను ఉపసంహరించుకోగా మొదటి ప్రమాద హెచ్చరిక కొనసాగుతోంది.



వాజేడు మండలంలో వరద నీటిలో మునిగిన మిర్చి పంట


మహిళలతో కిక్కిరిసిన రంగలీల మైదానం


బతుకమ్మ ఆడుతున్న మహిళలు, యువతులు


భద్రకాళి ఆలయం వద్ద బతుకమ్మ ఆడుతున్న మహిళలు

పూలవనంలా రంగలీల మైదానం

- ఘనంగా సద్దుల బతుకమ్మ సంబరాలు
- పెద్ద సంఖ్యలో తరలివచ్చిన మహిళాలోకం


బతుకమ్మతో వస్తున్న మహిళలు

కరీమాబాద్, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ సంస్కృతికి అద్దం పట్టే పూల జాతర సద్దుల పండుగ మంగళవారం ఘనంగా జరిగింది. ఈ సారి సద్దుల బతుకమ్మ తేదీపై గందరగోళం నెలకొనడంతో సోమవారం కొందరు, మంగళవారం మరికొందరు జరుపుకున్నారు. మంగళవారం సాయంత్రం నగరంలోని ఉర్సు గుట్ట రంగలీల మైదానంలో వేడుక కన్నుల పండువగా జరిగింది. పించారు. వేలాది మంది మహిళలు తీరొక్క పూలతో అందంగా పేర్చిన బతుకమ్మలతో రావడంతో రంగలీలా మైదానం పూల జాతరను తలపించింది. 'బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో' అంటూ ఆడపడుచులు పాడిన ఆట, పాటలు ఆకట్టుకున్నాయి. బతుకమ్మ పాటలు పాడి సంప్రదాయబద్ధంగా ఆడి ఉర్సు రంగసముద్రం చెరువులో నిమజ్జనం చేశారు. అనంతరం పసుపు కుంకుమలతో వాయినాలు ఇచ్చిపుచ్చుకున్నారు. గౌరమ్మ రూపమైన పసుపు ముద్దతో మాంగళ్య భాగ్యం కలకాలం నిలవాలని ప్రార్థించారు. ఉత్సవాల్లో మిల్స్‌కాలనీ సీఐ బొల్లం రమేష్, ఎస్సై సురేష్ బందోబస్తు ఏర్పాటు చేశారు.

దసరా ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో భారీ బతుకమ్మను ఏర్పాటు చేశారు. వేడుకల్లో కమిటీ అధ్యక్షుడు నాగపూరి సంజయ్ బాబు, ప్రధాన కార్యదర్శి మేడిది మధుసూదన్, కోశాధికారి మండా వెంకన్నగౌడ్, ఉపాధ్యక్షుడు గోనె రాంప్రసాద్, ఇతర కమిటీ సభ్యులు, స్థానిక కార్పొరేటర్‌లు మరుపల్ల రవి, పల్లం పద్మా రవి, ముష్కమళ్ల అరుణా సుధాకర్ పాల్గొన్నారు. కాగా, ఈ వేడుకల్లో నగర మేయర్ గుండు సుధారాణి, మాజీ శాసన సభ్యుడు నన్నపునేని నరేందర్ పాల్గొన్నారు. స్థానిక మహిళలతో బతుకమ్మ ఆటలు ఆడి మహిళలకు సద్దుల బతుకమ్మ శుభాకాంక్షలు తెలిపారు.




బందోబస్తులో ఉన్న ఎస్సైకి బొట్టు పెడుతున్న మహిళ


బతుకమ్మతో వస్తున్న హిజ్రాలు


రంగలీల మైదానంలో బతుకమ్మ వేడుకల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్


బతుకమ్మను చెరువులో వదులుతున్న యువతి

బీసీల రిజర్వేషన్లకు మద్దతివ్వాలి

- మునిసిపాలిటీ అభివృద్ధికి రూ.50కోట్లు మంజూరు
- దేవాదుల ఫేజ్-3, ప్యాకేజీ 6పనులకు రూ.1,001కోట్లు మంజూరు
- స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి

స్టేషన్‌ఘన్‌పూర్, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): బీసీల రిజర్వేషన్ల అమలుకు సాహసోపేత నిర్ణయం తీసుకున్న రాష్ట్ర ప్రభుత్వానికి అన్ని పార్టీలు మద్దతివ్వాలని ఎమ్మెల్యే కడియం శ్రీహరి కోరారు. స్టేషన్‌ఘన్‌పూర్ మునిసిపాలిటీ అభివృద్ధికి ప్రభుత్వం రూ.50 కోట్లు మంజూరి చేయడంతో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి నాయకులతో కలిసి మంగళవారం పార్టీ కార్యాలయంలో క్షీరాభిషేకం చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కడియం మాట్లాడుతూ బీసీలకు 42శాతం రిజర్వేషన్లు అమలు చేయడంలో భాగంగా బీసీ బిల్లుకు అసెంబ్లీలో ఆమోదం తెలిపి, బిల్లు ఆమోదం కోసం గవర్నర్‌కు, కేంద్రానికి పంపినా స్పందించడం లేదన్నారు. బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కల్పనకు ప్రభుత్వం జీవోను విడుదల చేసి చరిత్రను సృష్టించిందన్నారు. బిల్లును రద్దు చేయాలని కోర్టులకు వెళ్లడం మానుకొని, బీసీలకు మద్దతుగా నిలువాలని కడియం కోరారు. ఈబీసీ రిజర్వేషన్ల అమలు సమయంలో స్పందించని పార్టీలు బీసీ రిజర్వేషన్ల అమలుపై మాట్లాడడం విడ్డూరంగా ఉందన్నారు.

హామీ మేరకు మునిసిపాలిటీగా మార్చాను..

ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు స్టేషన్‌ఘన్‌పూర్‌ను మునిసిపాలిటీగా మార్చుతానని మాట ఇచ్చి, నిలుపుకున్నానని కడియం పేర్కొన్నారు. మునిసిపాలిటీగా మారడమే కాకుండా మునిసిపల్ అభివృద్ధికి కట్టుబడి ఉన్నానన్నారు. స్టేషన్‌ఘన్‌పూర్‌పై ప్రేమతో రూ.50కోట్ల నిధులు మంజూరు చేసినందుకు ప్రజల తరుపున సీఎంకు కృతజ్ఞతలు తెలిపారు.


సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే శ్రీహరి

దేవాదుల ఫేజ్-3, ప్యాకేజీ-6లో భాగంగా నాలుగు నియోజకవర్గాల పరిధిలోని 78వేల ఎకరాలకు సాగునీరు అందించడానికి సవరించిన అంచనాలతో ప్రభుత్వం రూ.1,001కోట్ల నిధులు మంజూరి చేస్తూ పరిపాలన పరమైన అనుమతులు ఇచ్చిందన్నారు. నియోజకవర్గానికి ఏం కావాలి, ఏం చేయాలనే ఆలోచనతోనే పని చేస్తున్నట్టు కడియం పేర్కొన్నారు. నియోజకవర్గ రైతులకు సాగునీరు, విద్యుత్ సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు రాకుండా చర్యలు చేబడుతున్నట్లు తెలిపారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థులు గెలిపించుకోవాలని, అందరూ ఒకేతాటిపై ఉంటే అభివృద్ధి జరుగుతుందన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ చైర్మన్ మారుజోడు రాంబాబు, మార్కెట్ చైర్‌పర్సన్ జూలకుంట్ల లావణ్య-శిరీష్ రెడ్డి, చిలుపూరు దేవస్థానం చైర్మన్ పొట్లపల్లి శ్రీధర్‌రావు, పార్టీ మండలాధ్యక్షుడు శిరీష్‌రెడ్డి, గడ్డమీది సురేష్, నాయకులు అంబటి కిషన్‌రాజు, బూర్ల శంకర్, నాగరబోయిన శ్రీరాములు, పోశాల కృష్ణ, మధుసూదన్ రెడ్డి, రాపోలు శివచరణ్ రెడ్డి, కుందూరు వెంకట్ రెడ్డి, మంతెన ఇంద్రసేనా రెడ్డి, నీల గట్టయ్య, తెల్లాకుల రామకృష్ణ, రజాక్‌యాదవ్, నాగరబోయిన యాదగిరి, యార సెల్ కొమురెల్లి, గట్టు ఎల్లయ్యగౌడ్ పాల్గొన్నారు.

కొండెక్కిన మటన్

- దసరా పండుగ వేళ రూ.వెయ్యికి చేరిన కేజీ ధర
- రూ.10 వేల నుంచి 20వేలు పలుకుతున్న పొట్టేలు
- ఐదేళ్ల తర్వాత పెరిగిన రేట్లు

శంభునిపేట, ఎప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): దసరా పండుగ వచ్చిందంటే చాలు సుక్క, ముక్క ఉండాల్సిందే. దసరా పండుగకు మటన్‌కు యమ క్రేజ్ ఉంటుంది. పొట్టేళ్ళ మాంసానికి మరీ ఎక్కువ డిమాండ్ ఉండటంతో మార్కెట్‌లో వాటి ధరలు విపరీతంగా పెరిగాయి. పది కేజీల మాంసం ఉండే పొట్టేలు ధర సంతల్లోనే రూ.10 వేల నుంచి రూ.14 వేలు పలుకుతోంది. దీంతో మాంసం ధరలు అమాంతం పెరిగి జిల్లాలో తొలిసారి మటన్ కిలో రేటు రూ.1000కి చేరింది. ఐదేళ్ళ క్రితం 900 పలికిన మటన్ ధర, ప్రస్తుతం రూ.వెయ్యి పలుకుతోంది. 2018లో రూ.800, 2021లో రూ.900 అమ్మగా ప్రస్తుతం 2025లో రూ.1000 చేరింది.

పొట్టేళ్ళ కొరత..

మటన్ అంటే మాంసం ప్రియులు అమితంగా ఇష్టపడుతుంటారు. అందులో పొట్టేలు మాంసానికి ఉన్న క్రేజే వేరు. అయితే మార్కెట్‌లో డిమాండ్‌కు తగిన పొట్టేళ్ళ ఉత్పత్తి లేదు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో కొమ్మాల, పాలకుర్తి, రఘునాథపల్లి, తొర్రూర్, జంగాలపల్లి, ముల్కనూరు, నెక్కొండ సంతల్లో పొట్టేళ్ళ క్రయవిక్రయాలు జరుగుతుంటాయి. వీటికి తోడు గ్రామాల్లోని మందల్లో కొనుగోలు చేస్తుంటారు. కాని ఈ సంతల్లో అమ్మే జీవాలు జిల్లాలోని మాంసాహారులకు సరిపోవడం లేదు. వరంగల్ జిల్లాలో నెలకు సుమారు ఆరు నుంచి ఏడు వేల జీవాలను మాంసం ఉత్పత్తికి వినియోగిస్తున్నారు. పెళ్ళిల్ళు, పండుగ సీజన్‌లలో ఈ సంఖ్య రెట్టింపు అవుతుంది. కాని మన జిల్లాలో సగానికి పైగా యాటల ఉత్పత్తి కూడా లేదు. దీంతో మాంసం విక్రయదారులు జిల్లాలోని సంతలే కాకుండా హైదరాబాద్, మిర్యాలగూడ, పెబ్బేరు, అనంతపురం, ఇచ్చోడ, నవీపేట, నాగ్‌పూర్, ఇతర సంతలకు వెళ్ళి పెద్ద సంఖ్యలో జీవాలను కొనుగోలు చేస్తున్నారు.

తెలంగాణతో పాటు మహారాష్ట్ర, చత్తీస్‌గఢ్, రాష్ట్రాల యాటల మాంసం రుచిగా ఉంటుందని అందరూ నమ్ముతారు. అందుకే వాటికి విపరీతమైన డిమాండ్ ఉంది. మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్, రాజస్థాన్, బీహార్ ప్రాంతాల నుంచి లారీల్లో జీవాలను తీసుకువచ్చి తెలంగాణలోని పెద్ద సంతల్లో అమ్ముతున్నారు.



గాంధీ జయంతి ఎఫెక్ట్

ఈ సారి దసరా పండుగ గాంధీ జయంతి రోజున రావటంతో మాంసం దుకాణాలు బంద్ చేస్తున్నట్లు మాంసం విక్రయదారులు తెలుపుతున్నారు. దసరా సంప్రదాయ ఉత్సవాలకు ఆటంకం కలుగకుండా చూస్తామని తెలిపారు. ఆడపడుచుల పండుగ బతుకమ్మ ముగియగానే దసరా సంబురాలు మొదలవుతాయి. ప్రతీ ఇంట్లో మాంసాహారాన్ని వండుకుంటారు. మూడు రోజులు దసరాను జరుపుకుంటామని.. ఈ విషయంలో తగ్గేదేలేదని మాంసం ప్రియులు ముక్త కంఠంతో చెబుతున్నారు.

బతుకమ్మ ఎత్తిన బాషా దంపతులు


ఇందిరమ్మకాలనీలో కుటుంబ సభ్యులతో బతుకమ్మను ఎత్తుకుని వస్తున్న బాషా

వరంగల్‌సిటీ, సెప్టెంబరు30 (ఆంధ్రజ్యోతి): నగరంలోని 14 వ డివిజన్ ఇందిరమ్మ కాలనీ ఫేస్ 2 లో సద్దుల బతుకమ్మ వేడుకలు ఘనంగా జరిగాయి. స్థానిక ముస్లిం మైనారిటీ నాయకుడు బాషా రజియా దంపతులు బతుకమ్మను ఎత్తుకొని కుటుంబ సమేతంగా వెళ్లి సద్దుల బతుకమ్మ వేడుకల్లో పాల్గొన్నారు. బాషా దంపతులు బతుకమ్మను రంగురంగుల పూలతో అలంకరించి నెత్తిన ఎత్తుకుని వేడుకల వద్దకు వెళ్లారు. బాషాను చూసి అందరూ ఆప్యాయంగా పలకరించారు. అభినందనలతో ముంచెత్తారు. ఈ సందర్భంగా బాషా మాట్లాడుతూ.. కుల మతాలు అనేవి మనం సృష్టించుకున్నవేనని, అన్ని పండుగలను అందరం కలిసి చేసుకుంటే మత సామరస్యం వెల్లివిరుస్తుందని అభిప్రాయం వ్యక్తం చేశారు.

రోకలిబండతో కొట్టి..

- భార్యను హత్య చేసిన భర్త
- మద్యానికి డబ్బులు ఇవ్వకపోవడంతో దారుణం


ఘటన స్థలంలో ప్రమీల మృతదేహం

చిట్యాల, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : క్షణికావేశంలో భార్యను భర్త రోకలిబండతో కొట్టి హత్య చేసిన ఘటన భూపాలపల్లి జిల్లా చిట్యాల మండలంలో మంగళవారం సాయంత్రం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని తిరుమలపురం గ్రామంలో కనుకుంట్ల ప్రమీల (50), లింగయ్య దంపతులకు ఇద్దరు కుమారులు. ఇంటి వద్దే ఈ దంపతులు పిండి గిర్నీ నిర్వహిస్తున్నారు. దీనికి తోడు లింగయ్య టైలర్‌గా పనిచేస్తున్నాడు. కొంత కాలంగా లింగయ్య మద్యానికి అలవాటు పడ్డాడు. దీంతో భార్యాభర్తల మధ్య తరచూ గొడవలు జరుగుతున్నాయి. మంగళవారం కూడా లింగయ్య మద్యం తాగేందుకు భార్యను డబ్బులు అడిగాడు. ఆమె ఇవ్వడానికి నిరాకరించింది.

ఈ క్రమంలో బయటకు వెళ్లొచ్చిన లింగయ్య ఆ కోపంతో భార్యతో గొడవ పడ్డాడు. ఇద్దరి మధ్య తీవ్రంగా వాగ్వాదం జరిగింది. దీంతో క్షణికావేశానికి గురైన లింగయ్య భార్య ప్రమీలపై దాడి చేశాడు. రోకలిబండతో తలపై పలుమార్లు కొట్టడంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. చుట్టుపక్కల వారు గమనించడంతో అక్కడి నుంచి పరారయ్యాడు. సమాచారం అందుకున్న సీసీ మల్లేష్, ఎస్సై శ్రావణ్‌కుమార్ ఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం చిట్యాల సామాజిక ఆస్పత్రికి తరలించారు. మృతురాలి చిన్న కుమారుడు సురేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.



సూర్యుడి చుట్టూ వలయాకారం

ఆకాశంలోని సూర్యుడి చుట్టూ మంగళవారం మధ్యాహ్నం వలయాకారం కనిపించడంతో పలువురు ఆసక్తిగా తిలకించారు. వారం రోజులుగా వర్షాలు కురవడంతో మేఘావృతమై ఉండి ఆకాశంలో సూర్యుడు కనిపించలేదు. సోమ, మంగళవారాలు ఎండ కాయడంతో మంగళవారం సూర్యుడు కనిపించడం, దాని చుట్టూ ఇంద్రధనస్సులా వలయాకారం కనిపించడాన్ని పలువురు సెల్‌ఫోన్‌లో ఫొటోలు తీసుకున్నారు.

- ఆంధ్రజ్యోతి, దుగ్గొండి

బీసీ రిజర్వేషన్ల తీరుపై గగ్గోలు

- ఇద్దరు ఓటర్లే ఉన్నా రిజర్వేషన్ కేటాయింపు
- తలలు పట్టుకుంటున్న స్థానిక నేతలు

మరిపెడ, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : తండాకు ఇద్దరే బీసీ ఓట ర్లు ఉన్న ఐదు జీపీలను బీసీలకు కేటాయిస్తూ అధికారులు గెజిట్ విడు దల చేశారు. దీంతో ఆ తండాలకు చెందిన వివిధ రాజకీయ పార్టీల స్థానిక నేతలు తలలు పట్టుకుంటున్నారు. ఆ రిజర్వేషన్లను సత్వరం రద్దు చేసి ఎస్టీలకు కేటాయించాలని ఆయా తండాల జనం కోరుతున్నారు. మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలం అజ్మీరాతండా, అమృ తండా, వెంకట్యాతండా, ధరావత్‌తండా, నేతావత్ పర్కాజల్ తండా జీపీ లలో 99.9 శాతం గిరిజనులు ఉన్నారు. ఆ తండా జీపీలను అధికారులు గుడ్డిగా బీసీలకు కేటాయించి చేతులు దులుపుకున్నారు. దీంతో ఆయా తండాల నేతలు తంటాలు పడుతున్నారు.

జీపీలను ఎస్టీలకు కేటాయించాలి



99.9 శాతంకు పైగా గిరిజన ఓటర్లు ఉన్న తండా జీపీలను బీసీలకు రిజర్వేషన్ చేయడం సరికాదు. ఇప్పటికైనా అధికారులు తమ తప్పులను సరిదిద్దుకుంటే మంచిది. లేకుంటే ప్రభుత్వంపై గిరిజనులు తిరగబడతారు. తండాల్లో ఎస్టీలకు రిజర్వేషన్ కల్పించాలి.

ధరావత్ పద్మ, మాజీ సర్పంచ్, అమృతండా జీపీ

ఇద్దరే ఓటర్లు

అమృతండా, అజ్మీరాతండా, ధరావత్‌తండా, వెంకట్యాతండా, నేతావత్ పర్కాజల్ తండాలలోని జీపీలలో ఇతర రాష్ట్రాలకు చెందిన భార్యాభర్తలు ఆయా జీపీకి ఇద్దరేసి చొప్పున ఓటర్లుగా నమోదై ఉన్నారు. ఇతర రాష్ట్రాల నుంచి ఇక్కడికి వ్యవసాయ పనుల కోసం కూలీలుగా వచ్చి ఉండడంతో అప్పట్లో వారిని ఓటర్లుగా నమోదు చేశారు. అమృతండా, వెంకట్యాతండా, నేతావత్ పర్కాజల్‌తండా, అజ్మీరా తండా జీపీల్లో ఇతర రాష్ట్రాలకు చెందిన ఇద్దరేసి బీసీ ఓటర్లు ఉండగా ఆ తండాల జీపీలను, ఇక ధరావత్ తండాలో నలుగురు ముస్లిం ఓటర్లు ఉండగా దానిని కూడా బీసీలకే కేటాయించారు. 99.9 పైగా ఓటర్లు ఉన్న గిరిజనులకు రిజర్వేషన్ కేటాయించలేదు. బీసీలకు తండా పంచాయతీలను రిజర్వేషన్ చేయడంపై అక్కడి ఓటర్లు ప్రభుత్వ విధానంపై మండి పడుతున్నారు.



అమృతండా జీపీ కార్యాలయం

తండాలో ఎస్టీల పాలనకు సమాధి చేసే కుట్ర

99.9 శాతం గిరిజన ఓటర్లు ఉన్న తండాలను ఇతర కులాల వారికి కేటాయించడం తమ తండాలో తమ పాలనను సమాధి చేయడానికి ప్రభుత్వం కుట్రలు చేస్తుందని లంబాడీల ఐక్య వేదిక ఇదివరకే ఆరోపించింది. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో 50 శాతం గిరిజన జనాభా ఉంటే ఎస్టీలకే తండాల జీపీలను కేటాయించిందని గిరిజన సంఘాలు గుర్తు చేస్తున్నాయి. ఇప్పటికైనా ప్రభుత్వం తండా జీపీలను తండా వాసులకే రిజర్వు చేయాలని డిమాండ్ చేస్తున్నారు.



నెల్లుట్లలో మాట్లాడుతున్న గుడి వంశీధర్‌రెడ్డి

'స్థానికం'లో కాంగ్రెస్ సత్తా చాటాలి

మాజీ జడ్పీటీసీ గుడి వంశీధర్‌రెడ్డి

లింగాలఘణపురం, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ సత్తాను చాటాలని తాజా మాజీ జడ్పీటీసీ గుడి వంశీధర్‌రెడ్డి అన్నారు. మంగళవారం నెల్లుట్లలోని తన కార్యాలయంలో కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతూ రిజర్వేషన్లు అనుకూలించక పోయినా ఆశావహులు నిరుత్సాహం చెందవద్దని సూచించారు. కార్యకర్తలకు ఎలాంటి ఇబ్బందులు వచ్చినా అండగా ఉంటానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు, ఏఎంసీ వైస్ చైర్మన్ కొల్లూరు శివకుమార్, నాగేందర్, బుషిగం పల ఆంజనేయులు, మార్కెట్ డైరెక్టర్లు నీలం మోహన్, శ్రీలతారెడ్డి, దేవరాయ రాజు, కూకట్ల మల్లయ్య, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

సీపీఎంలోకి చేరికలు



పార్టీ కండువా కప్పి ఆహ్వానిస్తున్న రాజు, సోమయ్య

జఫర్‌గడ్, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు రాపర్తి రాజు, రాపర్తి సోమయ్య పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. మండలంలోని కూనూరులో మంగళవారం పలు కుటుంబాలు సీపీఎం పార్టీలో చేరగా వారికి కండువా కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా రాయపురం భిక్షపతి అధ్యక్షతన జరిగిన సమావేశంలో రాజు, సోమయ్య మాట్లాడుతూ ఏళ్లుగా సమస్యల పరిష్కారం కోసం ప్రజలు, కార్మికులు, రైతుల పక్షాన నిలిచి సీపీఎం పోరాడుతుందన్నారు. సమావేశంలో సీపీఎం మండల కార్యదర్శి గుండెబోయిన రాజు, నాయకులు శాగ యాదగిరి, సకినాల కొమురయ్య, మున్వర్ పాషా, బైకాని రాజు, బైకాని కుమార్, ఇల్లందుల రామస్వామి, కుమార్, కనకయ్య, సతీష్ పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు రాజయ్య పరామర్శ

చిలుపూర్, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : పల్లగుట్టలో రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన సాదం కోమల, అనారోగ్యంతో మృతి చెందిన తప్పెట మల్లారెడ్డి కుటుంబాలను మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య మంగళవారం పరామర్శించారు. మృతదేహాలకు నివాళులర్పించి, బాధిత కుటుంబాను ఓదార్చారు. కార్యక్రమంలో మర్రి శ్రీధర్, కలకోట్ల చొక్కయ్య ఉన్నారు.

1న అర్ధరాత్రి వరకు మటన్ విక్రయాలు

జనగామ రూరల్, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): అక్టోబరు 2న గాంధీ జయంతి సందర్భంగా 1వ తేదీ అర్ధరాత్రి 12 గంటల వరకు మటన్ విక్రయిస్తున్నట్లు ఆరె కటిక సంఘం జనగామ పట్టణ అధ్యక్షుడు కె. హరిప్రసాద్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గాంధీ జయంతి సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం మాంసం విక్రయిస్తే చర్యలు తప్పవని హెచ్చరించిన నేపథ్యంలో బుధవారం అర్ధరాత్రి వరకు మాత్రమే మాంసం విక్రయించనున్నట్లు తెలిపారు.

బ్రిడ్జి నిర్మాణానికి మోక్షం ఎప్పుడు?

- దశాబ్దాలుగా కలగా మిగిలిన వంతెన నిర్మాణం
- ఇబ్బందులు పడుతున్న ఆయా గ్రామాల వాసులు
- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు



పాలకుర్తి, దర్దెపల్లి గ్రామాల మధ్య లోలెవల్ వంతెన

పాలకుర్తి, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : మూడు దశాబ్దాల క్రితం నిర్మించిన లోలెవల్ వంతెనతో పలు గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్న పరిస్థితి. పాలకుర్తి, దర్దెపల్లి గ్రామాల మార్గ మధ్యలోని వాగు నుంచి ఇతర గ్రామాలకు వెళ్లేందుకు ఈ లోలెవల్ వంతెనపై నుంచి ప్రయాణం చేయాల్సి ఉంది. భారీ వర్షాలు కురిసిన సమయాల్లో వరద నీరంతా లోలెవల్ వంతెనపై ప్రవహిస్తుండడంతో ఇతర గ్రామాలకు సంబంధాలు తెగిపోతున్నాయి. సమస్యను అధిగమించేందుకు గత ప్రభుత్వ రహదారులు, భవనాలశాఖ ఆధ్వర్యంలో బ్రిడ్జి నిర్మాణానికి ఎస్‌డీఎఫ్ నిధుల నుంచి రూ.19కోట్లు మంజూరి చేసింది. టెండర్ల ప్రక్రియ పూర్తయింది. అయితే ప్రభుత్వం మారడంతో ఇప్పటి వరకు ఎలాంటి పనులు ప్రారంభించలేదు. దీంతో ఏళ్ల తరబడి ఎదురు చూస్తున్న కల సాకరం కాకుండా పోయిందని ఈ రెండు గ్రామాల ప్రజలు ఆందోళన చేస్తున్నారు. గత ఏడాది వర్షాలు కురవడంతో వాగుపై వరద నీరు పొంగిపొర్లింది. దీంతో పాలకుర్తి, నాంచారీమడూరు మధ్య రెండు రోజులపాటు రాకపోకలు స్తంభించాయి. ఇటీవల వర్షాలు కురుస్తుండడంతో ఈ వాగుపై నుంచి వరద నీరు పొంగితేపొర్లుతే రాకపోకలకు ఇబ్బందులు పడక తప్పదంటున్నారు. ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి బ్రిడ్జి నిర్మాణానికి చొరవ చూపాలని కోరుతున్నారు.

హైలెవల్ బ్రిడ్జి నిర్మించాలి

జల్లం అంజయ్య, దర్దెపల్లి వాసి



దర్దెపల్లి వాగుపై హైలెవల్ బ్రిడ్జి నిర్మిస్తే ప్రజల ఇబ్బందులు తప్పుతాయి. ప్రభుత్వం వెంటనే బ్రిడ్జి నిర్మాణాన్ని ప్రారంభించాలి. చిన్నపాటి వర్షానికే పాలకుర్తి నుంచి నాంచారిమడూరుకు వెళ్లే వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రైతులు వ్యవసాయ బావుల వద్దకు వెళ్లాంటే ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని నీటిని దాటాల్సి వస్తోంది.

మోడల్ కోడ్ కండక్ట్‌ను అమలు చేయాలి

పాలకుర్తి, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల ప్రవర్తన నియమావళిని పక్కాగా అమలు చేయాలని జిల్లా సహకార అధికారి, జెడ్పీటీసీ ఎన్నికల రిటర్నింగ్ అధికారి కె.కోదండరాములు తెలిపారు. మంగళవారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో వివిధ రాజకీయ పార్టీల నాయకులతో మోడల్ కోడ్ కండక్ట్‌పై అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఇద్దరు పిల్లలున్న వారు మాత్రమే ఎన్నికల్లో పోటీ చేయడానికి అర్హులన్నారు. ఎన్నికల కోడ్ అమలుకు అన్ని రాజకీయ పార్టీలు సహకరించాలని కోరారు. ఎన్నికల అధికారులు ఏ ఒక్క పార్టీకి కూడా అనుకూలంగా పని చేయరాదన్నారు. 29 నుంచే కోడ్ అమల్లోకి వచ్చినట్టు పేర్కొన్నారు. సమావేశంలో ఎంపీడీవో రవీందర్, ఎంఈవో పోతుగంటి నర్సయ్య, ఎంపీవో వేణుమాధవ్, వివిధ రాజకీయ పార్టీల నాయకులు పసునూరి నవీన్, మాచెర్ల ఎల్లయ్య, ఎడవెల్లి సోమమల్లయ్య పాల్గొన్నారు.



పాలకుర్తిలో మాట్లాడుతున్న రిటర్నింగ్ అధికారి కోదండరాములు



రోడ్డుపై గుంతలను పూడ్చి వేయిస్తున్న బ్రహ్మారెడ్డి

రోడ్డుపై గుంతల పూడ్చివేత

జఫర్‌గడ్, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల కురిసిన వర్షాలకు మండలంలోని తమ్మడపల్లి(జి) గ్రామశివారులో ప్రధాన రహదారిపై లోతైన గుంతలు ఏర్పడి బురదమయంతో రాకపోకలకు ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీంతో స్పందించిన మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ అన్నం బ్రహ్మారెడ్డి మంగళవారం తన సొంత ఖర్చులతో జేసీబీచే గుంతల్లో నిలిచిన బురదను తొలగించడంతో పాటు ట్రాక్టర్లతో మొరం పోయించి లోతైన గుంతలను పూడ్చి వేసి చదును చేయించారు. దీంతో గ్రామానికి వచ్చే ఆర్టీసీ బస్సుతో పాటు ప్రజల రాకపోకలకు మార్గం సుగమమైందని గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేస్తూ బ్రహ్మారెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

'స్థానిక' అభ్యర్థులు నిబంధనలు పాటించాలి

కొడకండ్ల, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల బరిలో నిలిచేవారు నియమ నిబంధనలు పాటించాలని ఎంపీడీవో శేషాద్రి సూచించారు. మంగళవారం ఎంపీటీసీ, జడ్పీటీసీ స్థానిక ఎన్నికల్లో పోటీ చేయడానికి అభ్యర్థులకు ఉండాల్సిన అర్హత, నిబంధనలపై ఎంపీడీవో కార్యాలయంలో వివిధ రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శేషాద్రి మాట్లాడుతూ అభ్యర్థి తప్పనిసరిగా 21 ఏళ్లు పూర్తి చేసి, సంబంధిత నియోజకవర్గంలో ఓటరై ఉండాలన్నారు. ఇద్దరి కంటే ఎక్కువ పిల్లలు ఉంటే పోటీకి అనర్హులని, 31.05.1995 కంటే ముందే ఇద్దరి కంటే ఎక్కువ పిల్లలు ఉంటే పోటీ చేయొచ్చని పేర్కొన్నారు. నామినేషన్ల దాఖలు, ధ్రువీకరణ పత్రాలు సమర్పణ విధానంపై అవగాహన కల్పించారు.

మోసపూరిత విధానాలపై పోరాటం



సమావేశంలో మాట్లాడుతున్న రమేశ్

జఫర్‌గడ్, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న మోసపూరిత విధానాలపై సీపీఐ పోరాడుతుందని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జువారి రమేశ్ అన్నారు. సీపీఐ మండల కమిటీ సమావేశం మంగళవారం పెండ్యాల సమ్మయ్య అధ్యక్షతన జఫర్‌గడ్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రజలకిచ్చిన హామీలను అమలు చేయడంలో పాలకులు విఫలమయ్యారని విమర్శించారు. సమస్యలపై ప్రజలు, కార్మికులను చైతన్య పరుస్తూ వారి హక్కుల సాధన కోసం సీపీఐ నిరంతర ఉద్యమాలు సాగిస్తోందన్నారు. మండలంలో ప్రభుత్వ భూముల పరిరక్షణకై పోరాటం సాగించామన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో సీపీఐ పోటీ చేస్తుందన్నారు. సమావేశంలో సీపీఐ జిల్లా, మండల నాయకులు ఎండి.యాకూబ్ పాషా, మంద బుచ్చయ్య, ఎండి.జాఫర్, కూరపాటి చంద్రమౌళి, కలకోట ప్రభాకర్, సాయిలు, యాకయ్య, రాములు పాల్గొన్నారు.

ఎన్నికల్లో సీపీఎం అభ్యర్థుల్ని గెలిపించాలి

రఘునాథపల్లి, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎంపీటీసీ, సర్పంచ్‌లుగా సీపీఐ బలపర్చిన అభ్యర్థులను గెలిపించుకోవాలని ఆ పార్టీ మండల కార్యదర్శి కావటి యాదగిరి కార్యకర్తలకు పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో మంగళవారం జరిగిన కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతూ ప్రజా సమస్యలపై సీపీఐ నిరంతర పోరాటాలు చేస్తోందన్నారు. సమావేశంలో మండల సహాయ కార్యదర్శి కందుకూరి మల్లేష్, పసుల డానేలు, ముప్పు ఎల్లయ్య, దామెర అబ్బయ్య, గుండ్ల మురళి, తూడి శ్రీనివాస్, పండుగ మల్లేష్, బీరు నాగేశ్వర రావు, మడికంటి సోమన్న, భిక్షపతి, అంజయ్య ప్రవీణ్, లక్ష్మీనరసింహా పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న యాదగిరి



దేశాయితండాలో పూజలు చేస్తున్న శ్రీధర్‌రావు



శ్రీవిల్లాస్ కాలనీలో దుర్గామాత అలంకరణలో అమ్మవారు



స్టేషన్ ఘన్‌పూర్ ఉత్సవాల్లో పాల్గొన్న భక్తులు

ఘనంగా శరన్నవరాత్రి ఉత్సవాలు

జనగామ కల్చరల్, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): జిల్లాలో శరన్నవరాత్రోత్సవాలు కొనసాగుతున్నాయి. నవరాత్రులలో భాగంగా మంగళవారం తొమ్మిదో రోజు అమ్మవారిని దుర్గామాతగా అలంకరించారు. అమ్మవారిని ఎరుపు రంగు చీర, ఎరుపు రంగు పూలతో దేదీప్యమానంగా అలంకరించి నైవేద్యంగా నివేదించారు. బాలాజీనగర్, శ్రీరామనాథస్వామి దేవాలయం, అమ్మబావి, రెడ్డిస్ట్రీట్, ఆంజనేయ స్వామి దేవాలయంలో నవరాత్రులు నిర్వహించారు.

చిలుపూర్(ఆంధ్రజ్యోతి): దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా సాగుతున్నాయి. మంగళవారం అమ్మవారిని దుర్గాదేవిగా అలంకరించారు. దేశాయితండాలో చిలుపూర్ గుట్ట దేవస్థానం ట్రస్టుబోర్డు చైర్మన్ పొట్లపల్లి శ్రీధర్ రావు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. కృష్ణాజీగూడెం, చిన్నపెండ్యాల, మల్కాపూర్, చిలుపూర్ తదితర గ్రామాల్లో పూజలు చేశారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ భూక్య స్వామినాయక్, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు గడ్డమీది సురేశ్, భూక్య శ్రీనివాస్, తాళ్లపల్లి క్రాంతికుమార్, సంతోష్, గజ్జెల దామోదర్, నాగభూషణ్, యశ్వంత్‌రెడ్డి పాల్గొన్నారు.

స్టేషన్‌ఘన్‌పూర్ టౌన్(ఆంధ్రజ్యోతి): స్టేషన్ ఘన్‌పూర్, శివునిపల్లి పట్టణాల్లో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా సాగుతున్నాయి. మంగళవారం 9వ రోజు ఘనంగా నిర్వహించారు. స్థానిక ఎల్లమ్మ దేవాలయంలో, హనుమాన్ జ్యోతిషాలయం, శివునిపల్లి గాంధీ విగ్రహం, లలితాంబికా దేవాలయంలో ఉత్సవ కమిటీల ఆధ్వర్యంలో అమ్మవారిని మహిషాసుర మర్ధిని రూపంలో అలంకరించారు. కార్యక్రమాల్లో నిర్వాహకులు గన్ను శ్రీనివాస్, సునిత, కె.సతీష్, గడ్డం కృష్ణమూర్తి, కార్తీక్, విష్ణు శంకర్, సరాబు శశిక్, ఉమా శంకర్, బంగ్లా శ్రీను, వి.సురేందర్, పి.రంజిత్, వినయ్ పాల్గొన్నారు.

బచ్చన్నపేట(ఆంధ్రజ్యోతి): నాగిరెడ్డిపల్లిలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, అన్నదాన కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో తాతిరెడ్డి శశిధర్‌రెడ్డి, బంగారు మహేశ్, చెట్కూరి రాజు, బాలకిషన్, విజేందర్, భిక్షపతి, సుమన్, వెంకటేశం, రవి పాల్గొన్నారు.

నిధుల వరద

మునిసిపాలిటీ అభివృద్ధికి రూ.50 కోట్లు

(5వ పేజీ తరువాయి)

రూపొందిచాలని అధికారులను ఆదేశించడంతో రూ.86 కోట్లతో ప్రణాళికలు రూపొందించి ప్రభుత్వానికి పంపించారు. ప్రభుత్వం సూచనతో ఎస్టిమేషన్స్ తగ్గించి ప్రభుత్వానికి ఎమ్మెల్యే కడియం వివరించారు. దీనికి అంగీకరిస్తూ ప్రభుత్వం సెప్టెంబరు 29న మునిసిపాలిటీలో అభివృద్ధి పనులకు ఏకంగా రూ.50కోట్లు మంజూరు చేస్తూ మునిసిపల్ అడ్మినిస్ట్రేషన్ డిపార్టుమెంట్ నిధులను మంజూరు చేస్తూ జీవోను జారీ చేసింది.

మంజూరైన నిధుల వివరాలు...

మునిసిపాలిటీలో రూ.50కోట్లు మంజూరుతో స్థానికులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. అభివృద్ధి పనులను మొత్తం 25 పనులుగా విభజిస్తూ జీవోను జారీ చేశారు. విభాగాల వారీగా నిధులను విడుదల చేసింది. దీనికి ప్రకారం.

- నూతన మునిసిపాలిటీ నిర్మాణానికి రూ.5కోట్లు
- టౌన్ హాల్ నిర్మాణానికి రూ.2కోట్లు
- నేషనల్ హైవే వద్ద నుంచి వంద పడకల ఆస్పత్రి వరకు సీసీ రోడ్డు, సెంట్రల్ లైటింగ్‌కు రూ.70 లక్షలు
- గాంధీ చౌరస్తా నుంచి బస్టాండ్ వరకు సీసీ రోడ్డు, సెంట్రల్ లైటింగ్, డ్రైనేజీ నిర్మాణానికి రూ.3 కోట్లు
- ఇంటిగ్రేటెడ్ వెజ్ అండ్ నాన్‌వెజ్ మార్కెట్‌కు రూ.4 కోట్లు
- పాత ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ఎదురుగా పార్కు ఏర్పాటుకు రూ.కోటి
- ఛాగల్, శివునిపల్లి, వైకుంఠధామాలకు ఒక్కోదానికి రూ.కోటి
- ఘన్‌పూర్ వైకుంఠధామానికి రూ.3కోట్లు
- జంక్షన్ల అభివృద్ధికి రూ.1.5 కోట్లు
- జఫర్‌గడ్ రోడ్డు నుంచి డంపింగ్ యార్డు వరకు సీసీ రోడ్డు, వీధిలైట్ల ఏర్పాటుకు రూ.కోటి
- వరదనీరు, డ్రైనేజీ నీళ్ల వెళ్లడానికి రూ.7కోట్ల నిధులు
- డంపింగ్‌యార్డు అభివృద్ధికి రూ.1.5కోట్లు
- శివాజీ చౌరస్తా వద్ద నుంచి రైల్వే స్టేషన్ వరకు వీధిలైట్లకు రూ.80లక్షలు
- ఎక్స్‌కవేటర్, స్వచ్ఛ ఆటోలు, ట్రాక్టర్స్ కొనుగోలుకు రూ.కోటి
- రైల్వే స్టేషన్ వద్ద నుంచి శివునిపల్లి మీదుగా జఫర్‌గడ్ రోడ్డు వరకు సీసీ రోడ్డుకు రూ.కోటి
- లైబ్రరీ భవనం నిర్మాణానికి రూ.2కోట్లు
- ఓపెన్ జిమ్ నిర్మాణానికి రూ.50లక్షలు
- శివునిపల్లి సీసీ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణానికి రూ.4కోట్లు
- ఛాగల్‌లో సీసీ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణానికి రూ.4కోట్లు
- ఘన్‌పూర్‌లో బూత్ నంబర్లు 110, 111, 112, 113, 114లకు ఒక్కో బూత్‌కు సీసీ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణానికి రూ.కోటి చొప్పున రూ.4కోట్లు మంజూరు.

ఘన్‌పూర్‌కు మహర్దశ..

అంబటి కిషన్‌రాజు, కాంగ్రెస్ నాయకుడు, ఘన్‌పూర్ స్టేషన్



ఎమ్మెల్యే కడియం కృషితో ఘన్‌పూర్‌కు మహర్దవ వచ్చింది. ఏళ్ల మునిసిపాలిటీ కల నెరవేరడమే కాకుండా, మునిసిపాలిటీ అభివృద్ధికి నిధులు తీసుకురావడం ఆనందంగా ఉంది. డ్రైనేజీ వ్యవస్థ బాగు పడడంతో పాటు, వరదనీటి ఇబ్బందులు తొలగిపోనున్నాయి.

ఉత్తమ బతుకమ్మలకు బహుమతులు



శివునిపల్లి ఎస్సీ కాలనీలో విజేతలకు స్టీలు బిందెలు పంపిణీ చేస్తున్న వ్యాపార ప్రముఖులు

స్టేషన్‌ఘన్‌పూర్ టౌన్, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): శివునిపల్లి పట్టణంలో వ్యాపార, ఆర్య వైశ్య సంఘం, లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో సోమవారం రాత్రి సద్దుల బతుకమ్మ పండుగను పురస్కరించుకుని ఉత్తమ బతుకమ్మలను ఎంపిక చేశారు. శివునిపల్లి ఎస్సీ కాలనీలో వ్యాపార ప్రముఖులు, ఆర్య వైశ్య సంఘ నాయకులు పి.సోమశేఖర్, గోలి రాజశేఖర్, పార్సీ కృష్ణారావు, యంజాల ప్రభాకర్ తదితరులు, నగరేశ్వరాలయంలో, శివునిపల్లి చెరువు కట్ట వద్ద బతుకమ్మ ఆడుతున్న మహిళల గుంపుల వద్దకు వెళ్లి ఉత్తమ బతుకమ్మలకు బహుమతులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో క్లబ్ బాధ్యులు గౌరిశెట్టి అనిల్, పులి వినయ్‌కుమార్, నరేష్, మంగు జయప్రకాష్, టి.రమేశ్, ఎం.కిషోర్ పాల్గొన్నారు.

రఘునాథపల్లి,(ఆంధ్రజ్యోతి): మండేలగూడెంలో సద్దుల బతుకమ్మ సందర్భంగా ఆకర్షణీయంగా తీర్చిదిద్దిన 20ఉత్తమ బతుకమ్మలకు చెందిన మహిళలకు ఇదే గ్రామానికి చెందిన పొన్నాల నాగరాజు సోమవారం రాత్రి బహుమతులుగా చీరెలతో పాటు షీల్డులు అందజేసి సత్కరించారు. పదేళ్ల నుంచి నాగరాజు ఉత్తమ బతుకమ్మలకు బహుమతులను అందజేస్తున్నారు.

బీజేపీ మండల కమిటీ ఎన్నిక

పాలకుర్తి, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): పాలకుర్తి బీజేపీ మండల కమిటీ మంగళవారం ఎన్నికైందని అధ్యక్షుడు మారం రవికుమార్ తెలిపారు. మంగళవారం మండల కేంద్రంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. మండల ఉపాధ్యక్షుడుగా కనకమోజు రాణాప్రతాప్, మామిండ్ల వెంకన్న, కొడిశాల యాదగిరి, పబ్బ సంతోష్, ప్రధాన కార్యదర్శిగా వేల్పుల దేవరాజ్, పెనుగొండ సోమేశ్వర్, పూజారి రమేష్, కార్యదర్శులుగా గణగణ రాజు, బోనగిరి శ్రీనివాస్, గాదరి కాంతమ్మ, ఈర్ల రాజు, కోశాధికారిగా బాలగాని మహేష్ ఎన్నికయ్యారని తెలిపారు.

ఫ్లయింగ్ స్క్వాడ్ టీమ్ ఏర్పాటు

కొడకండ్ల, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల కోసం మండలానికి ఫ్లయింగ్ స్క్వాడ్ టీమ్ ఏర్పాటైందని స్థానిక తహసీల్దార్ చంద్రమోహన్ మంగళవారం ప్రకటనలో తెలిపారు. ఈ ఫ్లయింగ్ స్క్వాడ్ టీమ్‌ను రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు జిల్లా కలెక్టర్ ఏర్పాటు చేశారన్నారు. కొడకండ్ల మండల ఫ్లయింగ్ స్క్వాడ్‌గా డిప్యూటీ తహసీల్దార్ పద్మజ, ఏఎస్సై రమేష్, వీడియో గ్రాఫర్ అనిల్‌లను నియమించారని తెలిపారు. అక్రమ మద్యం, నగలు, లంచాల వస్తువులు, ఆయుధాల రవాణా, సంఘ విద్రోహ శక్తుల కదలికలపై 24 గంటల నిఘా ఉంటుందని, సంబంధిత ఫిర్యాదులను పరిశీలించి చర్యలు తీసుకుంటుందని తెలిపారు.

రాజకీయ పార్టీల నేతలతో అధికారుల సమావేశం



పార్టీల నేతలతో సమావేశమైన అధికారులు

బచ్చన్నపేట, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల నేతలతో సోమవారం ఎంపీడీవో మమతాబాయి ప్రత్యేక సమావేశం నిర్వహించారు. జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలకు మోడల్ కోడ్ కండక్ట్‌పై అవగాహన కల్పించారు. అనంతరం పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించి ఎన్నికల నిర్వహణ తీరుపై అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో ఎంపీవో మల్లిఖార్జున్ పాల్గొన్నారు.

రైతుల దరఖాస్తులపై అదనపు కలెక్టర్ రివ్యూ



రివ్యూ నిర్వహిస్తున్న అదనపు కలెక్టర్ బెన్షాలోమ్

బచ్చన్నపేట, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): భూ భారతి దరఖాస్తులను పరిష్కరించటంలో చొరవ చూపాలని అదనపు కలెక్టర్ బెన్షాలోమ్ అన్నారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయాన్ని తనిఖీ చేశారు. అనంతరం రైతులు చేసుకున్న పలు దరఖాస్తులపై రివ్యూ నిర్వహించారు. భూభారతి దరఖాస్తులు పరిష్కరించటంలో ఆలస్యమెందుకని అసంతృప్తి వ్యక్తం చేసినట్టు తెలిసింది. సాదా బైనామా, రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన దరఖాస్తుల పురోగతి వివరాలను తహసీల్దార్ రామానుజాచారిని అడిగి తెలుసుకున్నారు. సాదా బైనామాల విషయంలో రైతులకు నోటీసులిచ్చి వివరాలు సేకరించే ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు.

ప్రజాసేవే ఆర్‌ఎస్‌ఎస్ లక్ష్యం

పాలకుర్తి, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : ప్రజాసేవే లక్ష్యమని రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ (ఆర్‌ఎస్‌ఎస్) ప్రచారక్ బూరుగుల రామాచారి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో విజయదశమి ఉత్సవాన్ని నిర్వహించారు. రామాచారి మాట్లాడుతూ కరోన సమయంలో ఆర్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో ఐసోలేషన్ కేంద్రాలు ఏర్పాటు చేసి ఆహారం, మందులు పంపిణీ చేసినట్లు తెలిపారు. ఆర్‌ఎస్‌ఎస్ వంద సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఈ సంస్థ ప్రజలతో సేవా భావాన్ని పెంపొందిస్తోందని అన్నారు. స్వదేశీ, పర్యావరణ రక్షణ, కుటుంబ వ్యవస్థ బలోపేతం, సామాజిక సామరస్యత, పౌరవిధుల ఆచరణ ఈ ఐదు అంశాలు సమాజ మార్పుకు దోహదపడుతాయన్నారు. కార్యక్రమంలో ముచ్చింతల ప్రసాదరావు, వర్రె కుమార్, చిలుకమారి సోమేశ్వర్, దొంగరి మహేందర్, కమ్మగాని శ్రీకాంత్ ఉన్నారు.

ఆంధ్రజ్యోతి సదా మీ సేవలో...
దమ్మున్న వార్తలతో అశేష ప్రజాదరణ చూరగొన్న ఆంధ్రజ్యోతికి చందాదారులుగా చేరాలనుకుంటున్నారా!
పత్రికా పంపిణీలో మీరు ఏమైనా అసౌకర్యం ఎదుర్కొంటున్న యెడల నిస్సంకోచంగా మాకు ఫోన్ చేసి చెప్పవచ్చును. మా సిబ్బంది సదా మీ సేవకు సిద్ధంగా వుంటారు.
సంప్రదించగలరు : జనగామ
Jangaon ACO - 9985425870,
Jangaon - 1 SR - 9963609296,
St. Ghanpur - SR - 9652383080,
ACM - 9985411664